సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 28 । జూన్ । 2025



గిరిజన సంక్షేమానికి కృషి

బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గిరిజన సంక్షేమానికి కృషి చేస్తున్నానని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. 8లో



అంతా చెత్తచెత్తగా..!

జిల్లాలో అధికారుల పర్యవేక్షణలేక గ్రామాల్లోని చెత్త డంపింగ్ షెడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశంలో దట్టమైన మేఘాలు అలుముకోవచ్చు.

న్యూస్‌రీల్

బీమాతో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ప్రయోజనం



వివరాల నమోదును పరిశీలిస్తున్న అధికారులు

చుంచుపల్లి: మహిళా స్వయం సహాయక సంఘాలకు శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు రూ.20 ప్రీమియంతో బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, టేకులపల్లి మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు 391 మందికి ఇన్సూరెన్స్ చేశామన్నారు. ఏపీఎంలు, సెర్ప్, సీసీలు, బ్యాంకు సిబ్బంది, మండల సమాఖ్యలు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

ఎస్పీ రోహిత్‌రాజు



పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

చంద్రుగొండ : సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ రోహిత్‌రాజు పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. చంద్రుగొండ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. క్రైం రేట్‌పై ఆరా తీసి, రికార్డులను శీలించారు. సమస్యలతో స్టేషన్‌కు వచ్చేవారికి న్యాయం చేకూర్చాలన్నారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ శివరామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పిస్తాం

జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి

బూర్గంపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి తెలిపారు. బూర్గంపాడులోని తెలంగాణ గురుకుల పాఠశాల(బాలికలు)లో రూ 3 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ టాయిలెట్లకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ బాలయ్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్యకు వెండి కవచాల బహుకరణ



పర్ణశాలలో వెండి కవచాలతో దాత కుటుంబ సభ్యులు

దుమ్ముగూడెం/భద్రాచలంటౌన్: పర్ణశాల శ్రీసీతారామ చంద్రస్వామివారికి ఏపీలోని నెల్లూరుకు చెందిన ఒగిలి సంతోష్‌రెడ్డి–సాహిత్య దంపతులు రూ.11 లక్షల విలువైన వెండి కవచాలను శుక్రవారం బహుకరించారు. 10.500 కేజీల వెండిపై బంగారు పూతతో తయారు చేసిన కవచాలను ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక పూజలను చేశారు. తొలుత భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ

భద్రాచలంటౌన్: శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో స్వామివారికి శుక్రవారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. శ్రీరామచంద్రుని జన్మనక్షత్రం (పునర్వసు)ని పురస్కరించుకుని భక్తరామదాసు ట్రస్ట్ కొత్తగూడెం నిర్వాహకుడు కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భద్రగిరి ప్రదక్షిణా ర్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అధికారులు శ్రవణ్ కుమార్, శ్రీనివాస రెడ్డి, సాయిబాబు, వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, నేత్రగంటి కృష్ణమోహన్, టి.రామదాసు, ముక్తేశ్వర్, విజయవాడ భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ వచ్చాక అడవుల పెంపకంపై శ్రద్ధ పెరిగింది. హరితహారం పేరుతో భారీ ఎత్తున మొక్కలు నాటారు. పోడు వ్యవసాయాన్ని గట్టిగా అడ్డుకున్నారు. అడవుల్లో పెరిగే జంతువుల కోసం ప్రత్యేకంగా సోలార్ పంప్‌సెట్లు, సాసర్ పిట్లు ఏర్పాటు చేశారు. గడ్డి మైదానాలను అభివృద్ధి చేశారు. కెమెరాలు బిగించి అడవి జంతువుల కదలికలను గమనిస్తూ సంరక్షణ చర్యలు చేపట్టారు. ఫలితంగా కుందేళ్లు, అడవి పందులు, దుప్పులు, జింకలు, బైసన్ తదితర అటవీ జంతువుల సంఖ్య జిల్లాలో గణనీయంగా పెరిగింది. పెద్ద పులి సైతం జిల్లా అడవుల్లో స్థావరం ఏర్పాటు చేసుకునేందుకు తరుచుగా వచ్చిపోతోంది. అయితే పెద్దపులి కంటే ముందే పెరిగిన ఆ వన్యప్రాణులపై వేటగాళ్ల కన్ను పడింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం





అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న వన్యప్రాణి మాంసం(ఫైల్)

ఆర్డర్‌పై అడవి మాంసం!

జిల్లాలో రెచ్చిపోతున్న వన్యప్రాణి వేటగాళ్లు

- నాటు తుపాకులతో అడవుల్లో సాగుతున్న వేట
- కరెంటు తీగల ఏర్పాటుతో అటవీ జంతువుల వధ

రెచ్చిపోతున్న వేటగాళ్లు

రాష్ట్రంలోనే అత్యధికంగా అడవులు ఉన్న జిల్లా భద్రాద్రి కొత్తగూడెం. జిల్లా కేంద్రంగా ఉంటూ పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న కార్పొరేషన్ పరిధి చుట్టూ కిన్నెరసాని అభయారణ్యం ఉంది. దీంతో పల్లె ప్రజలకే కాదు పట్టణ వాసులకు అడవి జంతువులు కనిపించడం ఇక్కడ సాధారణ విషయం. దీంతో కొందరు సరదాగా అడవి పందులను వేటాడటం మొదలెట్టారు. ఇలా వచ్చిన మాంసాన్ని రహస్యంగా అమ్ముకుని తమ అవసరాలను తీర్చుకునే వారుకొందరు. వన్యప్రాణుల మాంసానికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో గడిచిన రెండేళ్లుగా వేటనే ప్రధాన పనిగా పెట్టుకునే ముఠాలు తయారయ్యాయి. జిల్లాలో పాల్వంచ, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, ఆళ్లపల్లి, గుండాల, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, అశ్వాపురం, కిష్టారం (బూర్గంపాడు) రేంజ్‌లలో వన్యప్రాణులను వేటాడేవారు పెరిగిపోయారు.

పోగుల్లేవు.. ఏకంగా శాల్తీలే..

ఒకప్పుడు పొలాలకు రైతులు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి లేదా వేటగాళ్ల అమర్చిన ఉచ్చుల్లో చిక్కుకుని అడవి పంది లేదా ఇతర జంతువులు చనిపోతే, ఆ విషయాన్ని రహస్యంగా ఉంచేవారు. బయటకు తెలియకుండా ఆ జంతువు కళేబరాలను పాతి పెట్టడమో, కొద్దిపాటి ధైర్యం చేసి పాతం చేసి పోగులు వేసి తమకు పరిచయస్తులైన కొందరికే ఆ మాంసాన్ని పంపించేవారు. కానీ ఇటీవల అదే పనిగా జంతువుల మాంసం కోసం అడవులపై కన్నేసే వారు పెరిగిపోయారు. ఉచ్చులు బిగించిప్పుడు, తుపాకులు పట్టుకుని అడవిలోకి వెళ్లేప్పుడే తమ 'సర్కిల్'లో ఉన్న వారికి సమాచారం ఇచ్చి ఆర్డర్లు తీసుకుంటున్నారు. చుక్కల దుప్పి మాంసానికి కేజీ రూ. 1,000 నుంచి రూ.1,500, అడవి పంది మాంసానికి రూ. 600 వంతున ఒక్కో జంతువుకు ఒక్కో రేటు చెబుతున్నారు. ఇటీవల ఒక అడుగు ముందుకు వేసి ఇటు వేటగాళ్లు, అటు మాంసం తీసుకునే వారు పోగుల కంటే ఏకంగా శాల్తీలకు శాల్తీలే బేరం చేయడానికి ఎక్కువగా ఉబలాటపడుతున్నారు. వన్యప్రాణుల వేటకు సంబంధించి వరుసగా వెలుగు చూస్తున్న ఘటనలు ఫారెస్ట్ శాఖ నిఘా వైఫల్యాలను ఎత్తి చూపుతోంది.

- ఈ నెల 15న వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి అన్నపురెడ్డిపల్లి మండలంలో ఎనిమిది గేదెలు మృత్యువాత.
- ఈ నెల 15న ములకలపల్లి మండలంలో కొందరు వేటగాళ్లు నాటు తుపాకులతో సంచరిస్తుండగా అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు
- మే 26న అశ్వారావుపేట మండలంలో కస్తూరి జింకకు సంబంధించిన అవశేషాలు పట్టుబడ్డాయి
- ఏప్రిల్ 17న దమ్మపేట మండలంలో ఓ తోటలో దుప్పి మాంసంతో విందు చేసుకుంటుండగా అటవీ శాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు
- ఏప్రిల్ 9న నాటు తుపాకులతో వేటకు వచ్చిన ముగ్గురిని అటవీ అధికారులు అరెస్ట్ చేశారు.
- మే 23న చుక్కల దుప్పి దారి తప్పి అశ్వారావుపేటలో సంచరించినట్లుగా ఫొటోలు బయటకు వచ్చాయి. అంతకు కొద్ది రోజుల ముందు కొత్తగూడెం నగరంలో గాజుల రాజం బస్తీలోకి ఒక దుప్పి వచ్చినట్లుగా వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ ఏడాది ఆరంభంలో గుండాల మండలం కాచనపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణి మాంసం విక్రయాలు జరగగా ఆ విషయాన్ని బహిర్గతం కానివ్వలేదననే ఆరోపణలు వచ్చాయి. ఇటీవల లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల అడవుల్లోనూ ఈ తరహా ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

బిల్లులు రాట్లే..

- ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఆవేదన
- నిలిచిపోయిన నాలుగు నెలల చెల్లింపులు
- పెండింగ్‌లోనే రూ.41.50 లక్షల గౌరవ వేతనం



నాగారం హైస్కూల్‌లో చెట్టు కింద వంట చేస్తున్న మహిళలు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

పాల్వంచరూరల్: 'విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని అధికారులు ఆదేశిస్తారు. అప్పడప్పుడూ తనిఖీలు చేస్తూ వంటలు బాగాలేవని ఆగ్రహం వ్యక్తం చేస్తారు. కానీ మాకు బిల్లులు రాకపోయినా ఎవరూ పట్టించుకోరు.' అని మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేస్తున్న ఏజెన్సీలకు నాలుగు నెలల బిల్లు పెండింగ్‌లో ఉంది. జనవరి నుంచి బిల్లులు రాకపోవడంతో అప్పు చేసి పిల్లలకు వంటలు వండిపెడుతున్నారు. కిరాణం, కూరగాయల దుకాణాల్లో ఖాతా రూ. వేలల్లో ఉంటోందని నిర్వాహకులు వాపోతున్నారు.

గౌరవ వేతనమూ పెండింగే..

జిల్లాలో ప్రభుత్వ స్కూల్స్ 1,309 ఉండగా 112 హైస్కూల్స్ ఉన్నాయి. వీటిల్లో వేల మంది విద్యార్థులు ఉండగా వంట నిర్వాహకులు 2,075 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం గౌరవ వేతనం కింద నెలనెలా రెండువేల చొప్పున చెల్లిస్తోంది. మార్చి నెల నుంచి రూ.41.50 లక్షల గౌరవ వేతనాలు రావాల్సిఉంది.

పేరుకుపోతున్న కోడిగుడ్ల బకాయిలు

విద్యార్థులకు కోడిగుడ్డు వండి వడ్డించేందుకు ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ.6 చొప్పున చెల్లిస్తోంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి సుమారు రూ.10 లక్షలకు పైగా గుడ్ల బకాయి పెండింగ్‌లో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలకు నిధులు ఖర్చు చేస్తున్నారు. కేంద్రం ద్వారా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున ఖర్చు భరిస్తున్నాయి. ఒకటో తరగతి నుంచి 6వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.6.19, 6 నుంచి 8వ తరగతులకు రూ.9.22, 9 నుంచి 10వ తరగతి వరకు రూ.11.67 చొప్పున ఖర్చు చేస్తున్నాయి.

కిచెన్ షెడ్లులేక అవస్థలు

జిల్లాలోని పలుచోట్ల పాఠశాలల్లో కిచెన్ షెడ్లు సక్రమంగా లేవు. పాల్వంచ మండలం నాగారం హైస్కూల్లో కిచెన్ షెడ్‌ను నిర్మించలేదు. దీంతో వంట చేసేందుకు ఇక్కట్లు తప్పడంలేదు. వర్షాకాలంలో వంటలు చేయాలంటే మధ్యాహ్న భోజన నిర్వాహకులకు కత్తి మీద సాములాగా మారింది. అధికారులు స్పందించి కిచెన్ షెడ్ నిర్మించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

అప్పులు తెచ్చి వండి పెడుతున్నాం



మధ్యాహ్న భోజనం బిల్లులు సకాలంలో రాకపోవడంతో అప్పులు చేసి వంట సామగ్రి తెస్తున్నాం. గౌరవ వేతనం తోపాటు నాలుగు నెలల బిల్లులు రావాల్సి ఉంది. అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి. – రాములమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, పాండురంగాపురం

బిల్లులు విడుదల చేయాలి



బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గౌరవ వేతనాలు, గుడ్ల డబ్బులు కూడా రావాల్సి ఉంది. పనులకు వెళ్లకుండా వంటలు చేయడానికి వస్తే బిల్లులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు.

– దేరంగుల అనసూయమ్మ, నాగారం

బడ్జెట్ రాగానే...



మధ్యాహ్న భోజన బిల్లులు, గౌరవ వేతనం, గుడ్ల బకాయిలు బడ్జెట్ రాకపోవడంతో పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు తయారుచేసి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపాం. బడ్జెట్ రాగానే ఖాతాల్లో జమ చేస్తాం. – వెంకటేశ్వరాచారి, డీఈఓ

ఘనంగా జగన్నాథ రథయాత్ర

గౌతమీనగర్ కాలనీలో సందడి



ఇరువైపులా బారులుదీరి స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో శుక్రవారం జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఒడిశాలో జరిగే పూరీ జగన్నాథ రథయాత్ర తరహాలో 26 సంవత్సరాలుగా గౌతమినగర్‌లో వేడుకలు నిర్వహిస్తుండటం విశేషం. ఉత్కల్ పతాగర్ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. జగన్నాథ స్వామి, బలభద్రస్వామి, సుభద్రాదేవి దేవతా మూర్తులకు తొలిరోజు ఆధ్యాపూజ, మధ్యాహ్న పూజ, పహండి, ఛెరపహారా తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పల్లకీలో మేళతాళాలు, కోలాటాలు, నృత్యాల నడుమ దేవతామూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. ఆ తర్వాత మండపంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. భారజల కర్మాగారం జీఎం శ్రీనివాసరావు వేడుకలను ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. ఛెరపహారా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులు కొలువైన రథాన్ని భక్తులు ఇరువైపులా బారులుదీరి లాగారు. ఆ తర్వాత గుండిచాఘర్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. రథయాత్రకు ఒడిశావాసులు, భారజల కర్మాగార ఉద్యోగులు, అశ్వాపురం పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాగా ఈ వేడుకలు 9 రోజులపాటు సాగనున్నాయి.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

చర్ల: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులతో కలిసి ఆమె చర్ల మండలంలో పర్యటించారు. లక్ష్మీకాలనీలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. చర్లలోని రైతు వేదికలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలు చేస్తోందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమంటేనే రైతును రాజును చేసే ప్రభుత్వమని, పేదల కష్టాలను తీర్చే ప్రభుత్వమని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఈదయ్య, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం విద్య, గ్రామీణాభివృద్ధి, బ్యాంకు, పంచాయతీ, తపాలా, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేయాలని, ఐదేళ్లు, పదిహేనేళ్లు దాటిన వారు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులు, పాఠశాలల్లో ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఆధార్ నమోదు కేంద్రాలు, ఆధార్ కార్డులపై అభ్యంతరాలు ఉంటే కలెక్టరేట్‌లో ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావును సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ రీజియన్ యూఐడీ అసిస్టెంట్ మేనేజర్ మహ్మద్ సౌరబ్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత పాల్గొన్నారు.

మోకాళ్లపై గని కార్మికుల నిరసన

మారుపేర్ల సమస్య పరిష్కరించడంలేదని ఆవేదన



సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్, సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట 11 ఏరియాల బాధితులు ప్లకార్డులతో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. గెస్ట్‌హౌస్‌లో డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు అధ్యక్షతన కంపెనీస్థాయి స్ట్రక్చరల్ సమావేశం నిర్వహిస్తుండగా బయట కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022లో ఆర్‌ఎస్‌సీ సమావేశంలో మారుపేర్ల సమస్య పరిష్కరించేలా నిర్ణయం తీసుకున్నా, అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రెండు ప్రాణాలను బలితీసుకున్న సింగరేణి యాజమాన్యం తీరు సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్క శ్రావణ్ గౌడ్, తిరుమల శ్రీనివాస్, ఈర్ల రాజయ్య, డీఎస్ బాబు, హరీష్ యాదవ్, వంగా సంతోష్, పార్దపల్లి హరీష్, పొన్నం వెంకటేశ్, కొమురమ్మ, ప్రదీప్, జిల్లాల శ్రావన్, గుర్రం సుధాకర్, అజ్మీర నరేష్, అంబటి రాజశేఖర్, ఆకుల కిరణ్, మొత్కురి రవికుమార్, కలావతి, ఇఫ్టూ నాయకులు గౌని నాగేశ్వరావు, ఎస్.సంజీవ్, శ్రవణ్, శ్రీనివాస్, వెంకటేశ్, రవి, సందీప్, బిందు, కొమరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి ఆధారంగా ఉద్యోగ అవకాశం కల్పించాలి

డిపెండెంట్ ఉద్యోగాలకు 10వ తరగతి ఆధారంగా ఉద్యోగ అవకాశం కల్పించాలని టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరభద్రం డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమావేశం సింగరేణి ప్రధాన కార్యాలయంలో నిర్వహించకుండా గెస్ట్‌హౌస్‌లో నిర్వహించటం సరికాదని అన్నారు. ఈ సందర్భంగా ర్యాలీగా వెళ్లిన నాయకులను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు.



డైరెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గుర్తింపు కార్మిక సంఘం నాయకులు

సింగరేణి యాజమాన్యంతో గుర్తింపు సంఘం నిర్మాణాత్మక సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రుతో గుర్తింపు సంఘం 51వ నిర్మాణాత్మక సమావేశం నిర్వహించింది. నాయకులు పలు సమస్యలను లేవనెత్తారు. యాక్టింగ్ క్లర్క్‌లను క్రమబద్ధీకరణ చేయాలని, సెక్యూరిటీ గార్డు ఖాళీలను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేయాలని, ప్రమోషన్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, రాష్ట్ర లేబర్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రిల్ ఆపరేటర్ కేడర్ స్కీమ్ కేసును పరిష్కరించాలని, సింగరేణి ఉద్యోగులతోనే బొగ్గు ఉత్పత్తి చేయించాలని, కారుణ్య నియమకాలు, గని ప్రమాద మృతుల వారసులకు విద్యార్హతలకు తగిన ఉద్యోగం ఇవ్వాలని గుర్తింపు సంఘం నాయకులు కోరగా.. వీలైనంత త్వరలో పరిష్కరిస్తామ డైరెక్టర్ తెలిపారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ గైర్హాజరు ఉద్యోగుల కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, భూగర్భ గనుల్లో ఉద్యోగుల హాజరుశాతం పెంచేందుకు కృషి చేయాలని చెప్పారు.

పెద్దమ్మతల్లికి అభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలు, కుంకుమపూజ, గణపతి హోమం నిర్వహించారు.

గోదావరి వరదలతో అప్రమత్తంగా ఉండాలి

సమీక్ష సమావేశంలో ఆర్డీఓ దామోదర్‌రావు



మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్‌రావు

భద్రాచలంటౌన్: గోదావరికి గతేడాది వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని ముంపు ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో శుక్రవారం డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ముంపునకు గురయ్యే ఏజెన్సీ గ్రామాల్లో కల్పించాల్సిన మౌలిక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముంపు ప్రాంత గ్రామాలను గుర్తించి పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రధానంగా ఏడు ముంపు మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముంపు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరదల సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని అన్నారు. మత్స్యశాఖ అధికారులు బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. మళ్లీ నిర్వహించే సమావేశానికి అధికారులు పూర్తిస్థాయి ప్రణాళికలు తయారు చేసుకుని రావాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, జిల్లా, డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

అంతా చెత్తచెత్తగా..!

టేకులపల్లి మండలం దాసుతండా గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించి తగలబెడుతున్నారు. ఫలితంగా పర్యావరణం కలుషితమవుతోంది. మరోవైపు డంపింగ్ యార్డు నిర్వహణ సక్రమంగా లేక పిచ్చిచెట్లతో దర్శనమిస్తోంది. మండలానికి ఒకటి, రెండు పంచాయతీల్లో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారే తప్ప మిగిలిన అన్ని చోట్లా ఇదే పరిస్థితి నెలకొంది.



టేకులపల్లి దాసుతండాలో వినియోగంలో లేని డంపింగ్ యార్డు

అలంకారప్రాయంగా సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు

- తడి, పొడి చెత్త వేరుచేయకుండా తగులబెడుతున్న కార్మికులు
- నిర్వహణలేక పిచ్చిచెట్లతో దర్శనమిస్తున్న డంపింగ్ షెడ్లు
- పట్టించుకోని జిల్లా పంచాయతీ అధికారులు

చుంచుపల్లి: జిల్లాలో చెత్త డంపింగ్ షెడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గ్రామాల్లో పరిశుభ్రత తోపాటు అదనపు ఆదాయం సమకూర్చాలనే ప్రభుత్వ లక్ష్యం అటకెక్కింది. పాలకవర్గాలు లేకపోవడం, పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కార్మికులు సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేయడంలేదు. గ్రామాల్లో పరిసరాల శుభ్రతకు ప్రభుత్వం ప్రతి పంచాయతీలో డంపింగ్ యార్డుతో పాటు, సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాలను నిర్మించింది. జిల్లాలో పాత 481 పంచాయతీల్లోనూ నిర్మాణం చేపట్టింది. ఒకో షెడ్డుకు ఉపాధి హామీ నిధుల నుంచి రూ.2.50 లక్షల చొప్పున ఖర్చు చేశారు. ఆ తర్వాత చెత్త సేకరణకు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసుకునేందుకు ఇంటింటికీ చెత్తబుట్టలు అందించారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇళ్ల వద్దనే వేర్వేరుగా చెత్తను సేకరించి, డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ కంపోస్ట్ షెడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరల్లో వాటిని పోసి, సేంద్రియ ఎరువుగా మార్చాల్సి ఉంటుంది. కానీ కార్మికులు ఒకే ట్రాక్టర్‌లో తడి, పొడి చెత్తను తరలించి డంపింగ్ యార్డులో పారబోస్తున్నారు. పొడి చెత్తలో లభించే ప్లాస్టిక్ గాజు, ఇనుము ఇతరత్రా సామగ్రిని విభాగాల వారీగా వేరుచేయడం లేదు. చాలా చోట్ల చెత్తను డంపింగ్ యార్డులో పోసి నిప్పు పెడుతున్నారు. తొలుత గ్రామపంచాయతీల్లో వెలువడే చెత్తను సెగ్రిగేషన్ షెడ్ల ప్రాంగణానికి తరలించి సేంద్రియ ఎరువు తయారు చేశారు. ఆ తర్వాత క్రమంగా ఆ ప్రక్రియకు స్వస్తి పలికారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పంచాయతీల్లో సేంద్రియ ఎరువును తయారీ ప్రక్రియ సాగుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో మిగతా చోట్ల సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. తొట్లలో పిచ్చిమొక్కలు పెరిగాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడకు తరలించాలనే విషయంలోనూ పంచాయతీ కార్యదర్శులకు ఇంత వరకు స్పష్టత లేదు. ప్రజల్లో అవగాహన లేకపోవడం, పంచాయతీల్లో కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటం ఇందుకు ప్రధాన సమస్యగా మారింది. పర్యవేక్షణ లోపం కారణంగా ఎరువు తయారీపై స్థానిక సిబ్బంది దృష్టి పెట్టడంలేదు. డంపింగ్ యార్డులు, సేంద్రియ ఎరువుల కేంద్రాల్లో సరైన మౌలిక సదుపాయాలు కల్పించలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.



శ్రీ ఇంక్‌లైన్‌లో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

దృష్టి సారిస్తాం..



జిల్లాలోని డంపింగ్ యార్డుల నిర్వహణపై దృష్టి సారిస్తాం. తడి, పొడి చెత్త సేకరణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాం. కొన్ని చోట్ల డంపింగ్ యార్డుల నిర్వహణ, ఎరువుల తయారీ జరుగుతోంది. మిగిలిన చోట్ల డంపింగ్ యార్డులను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం. –వి.చంద్రమౌళి, డీపీఓ

గిరిజన సంక్షేమానికి నిరంతరం కృషి



వీసీలో పాల్గొన్న పీఓ రాహుల్, తదితరులు

ఏడాది పూర్తయిన సందర్భంగా పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: మంచిర్యాల జిల్లాలో స్థానిక సంస్థల జేసీగా పనిచేసిన సమయంలో విద్యార్థుల అభివృద్ధికి కొన్ని నిర్ణయాలు తీసుకుని, అమలు చేయడంతో సత్ఫలితాలు వచ్చాయని, అదే తరహాలో ఐటీడీఏ పీఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గిరిజన సంక్షేమానికి తన వంతు కృషి చేస్తున్నానని పీఓ బి.రాహుల్ తెలిపారు. ఐటీడీఏ పీఓగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఓ పాల్గొని మాట్లాడారు. గిరిజన విద్యను పునాది నుంచి బలోపేతం చేసేందుకు ఉద్దీపకం వర్క్ బుక్ ప్రవేశపెట్టామని, మంచి ఫలితాలు వచ్చాయని, పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం రూపొందించి మంచి ఫలితాలు సాధించామని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు అంతరించిపోకుండా మ్యూజియం రూపకల్పనలో అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సహకారం మరిచిపోలేనిదన్నారు. అనంతరం యూనిట్ అధికారులు సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేశారు. పీఓను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఆర్సీఓ అరుణకుమారి, హరీశ్, భాస్కర్, ఉదయ్‌కుమార్, సున్నం రాంబాబు, అశోక్‌కుమార్, రమేశ్, భాస్కర్‌నాయక్, సమ్మయ్య, చైతన్య, జేడీఎం హరికృష్ణ, ఆదినారాయణ ఐటీడీఏ కార్యాలయంలోని అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దత్తత గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక

గవర్నర్ దత్తత తీసుకున్న గ్రామాల్లోని కొండరెడ్ల గిరిజనుల అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగిస్తామని పీఓ రాహుల్ తెలిపారు. రాజభవన్ క్యాంప్ కార్యాలయం నుంచి గవర్నర్ ఆఫ్ తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీఓ రాహుల్‌తో శుక్రవారం సమీక్షించారు. జిల్లాలోని దమ్మపేట మండలంలోని పూసుకుంట, అశ్వారావుపేట మండలంలోని గోగులపూడి గ్రామాల్లోని కొండరెడ్ల సంక్షేమానికి రూ.48.17 లక్షలు విడుదల చేశామని, వాటిని కేవలం కొండరెడ్ల కుటుంబాల రైతులు, నిరుద్యోగ యువత కోసం, మౌలిక వసతుల కల్పనకు వినియోగించాలని సూచించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. పూసుకుంట, గోగులపూడిలో నిరుద్యోగులకు టెంట్‌హౌస్‌లు, రైతులకు రెండు పవర్ టిల్లర్లు, 20 సోలార్ పంపుసెట్లు అందిచామన్నారు. ఇంకా జరిగిన అభివృద్ధి పనులను వివరించారు.

పాముకాటుతో గిరిజనుడు మృతి

దుమ్ముగూడెం: మండలంలోని అడవి రామవరం గ్రామానికి చెందిన మడవి హరీశ్ (28) పాముకాటుకు గురై గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. హరీశ్ పొలం పనులు చేస్తూ పామును తొక్కడంతో కాటు వేసింది. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో పొలం నుంచి అతను ఇంటికి వచ్చేసరికి పరిస్థితి విషమించింది. కుటుంబ సభ్యులు వైద్యానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

క్లుప్తంగా

అభివృద్ధి చేయడంలో విఫలం



మాట్లాడుతున్న అజ్మీరా సీతారాంనాయక్

పాల్వంచరూరల్: అవసరమైన వనరులు ఉన్నప్పటికీ ప్రభుత్వాల వైఫల్యం కారణంగా అభివృద్ధి కుంటుపడుతోందని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడా రు. కేటీపీఎస్, ఎన్‌ఎండీసీ, ఏపీ స్టీల్ వంటి పరిశ్రమలతో నాడు వెలుగు వెలిగిన పాల్వంచ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించక ప్రజలు వలస పోతున్న దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. పాల్వంచ, కొత్తగూడెంను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసే సమయంలో సంప్రదింపులు జరపలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం స్థల సేకరణలో జాప్యం చేస్తోందని ఆక్షేపించారు. సమావేశంలో నాయకులు భూక్యా సీతారాములు, బుడగం రవికుమార్, యడ్లపల్లి శ్రీనివాస్‌కుమార్, పానిశెట్టి వెంకటేశ్వర్లు, దున్నపోతుల రాజు, రవి, రమేశ్, వెంకట్, రామారావు, వీరన్న, సురేశ్ పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ ఫలితాల్లో 66.97 శాతం ఉత్తీర్ణత

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో జిల్లాలో 66.97 ఉత్తీర్ణత శాతం నమోదైందని డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 1,205 మంది విద్యార్థులు హాజరు కాగా, 807 మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. బాలురు 775 మందికి 512 మంది (66.06 శాతం) ఉత్తీర్ణత, బాలికలు 430 మందికి గాను 295 మంది (68.60శాతం) ఉత్తీర్ణత సాధించారని పేర్కొ న్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం జూలై 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు విద్యార్థులు చదివిన పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలని లేదా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు 99890 27943 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జగన్నాథపురంలో చోరీ

పాల్వంచరూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగలే చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన కొత్త దయాకర్‌రెడ్డి పాల్వంచలోని డీఏవీ పాఠశాలలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దయాకర్‌రెడ్డి భార్య వెంకటలక్ష్మి కేటీపీఎస్‌లో ఉద్యోగం చేస్తోంది. గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి ఇద్దరు విధులకు వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చి చూసే సరికి ఇంటి తలుపు తాళం, బీరువా తాళం పగుల గొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.25 వేల విలువైన వెండి వస్తువులను చోరీ చేశారు. వెంకటలక్ష్మి శుక్రవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

దమ్మపేట: కుక్కల దాడిలో మచ్చల దుప్పి పిల్ల మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దగొల్లగూడెం గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ ఇన్‌చార్జ్ అధికారి రవికిరణ్ కథనం ప్రకారం.. మండలంలోని పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన మేకలు మేత కోసం సమీపంలోని అడవికి వెళ్లాయి. సాయంత్రం వాటితోపాటు మచ్చల దుప్పి పిల్ల తప్పిపోయి గ్రామానికి వచ్చింది. గ్రామంలోని కుక్కలు ఆ దుప్పిని చూసి వెంటాడి, శివారులోని వ్యవసాయ క్షేత్రాల్లో దాడి చేశాయి. దీంతో ఆ దుప్పి పిల్ల మృతి చెందింది. గ్రామస్తులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి వారు చేరుకుని, దుప్పి పిల్ల కళేబరాన్ని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. కాగా, పోస్టుమార్టం శనివారం జరగనుండగా నివేదిక వచ్చాక వివరాలు వెల్లడిస్తామని రేంజర్ తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.18,748

ఇల్లెందుపై సీఐల నజర్?

ఎవరి ప్రయత్నం వారిదే

ఇల్లెందు: ఇల్లెందు ఎస్‌హెచ్‌ఓ బత్తుల సత్యనారాయణపై సస్పెన్షన్ వేటు పడటంతో పలువురు సీఐలు ఆ స్థానం కోసం పోటీ పడుతున్నట్లు తెలిసింది. ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నట్లు సమాచారం. శుక్రవారం పలువురు సీఐలు వివిధ ప్రాంతాల వచ్చి ఎమ్మెల్యే కోరం కనకయ్యను కలిసి వెళ్లారు. కనీసం పది మంది సీఐలు పోటీ పడుతున్నట్లు తెలిసింది. పూర్వం నుంచి ఇల్లెందులో సర్కిల్ కార్యాలయం ఉన్నప్పటికీ ఎస్‌ఐలు మాత్రమే ఎస్‌హెచ్‌ఓలుగా ఉండేవారు. 15 ఏళ్ల కిందట సీఐ ఎస్‌హెచ్‌ఓగా మారుస్తూ ఆదేశాలు వచ్చాయి. కాగా, ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ సస్పెన్షన్‌కు దారి తీసిన ఎస్‌ఆర్‌ఐ నవీన్‌రెడ్డి సమస్య ప్రస్తుతం పెండింగ్‌లో పడ్డట్లయింది. ప్రస్తుతం సీఐ స్థాయి అధికారి లేకపోవడంతో నవీన్‌రెడ్డి సతీమణి పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్లారు.

ఏటీఎం కార్డు చోరీ..



సహాయం చేస్తున్నట్లు నటిస్తున్న (ఎడమవైపు) వ్యక్తి

టేకులపల్లి: సహాయం చేస్తున్నట్లు నమ్మించిన ఓ వ్యక్తి.. ఏటీఎం కార్డు చోరీచేసి, అందులోని రూ.31 వేలు డ్రాచేసిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎలక్ట్రానిక్స్, నెట్ సెంటర్ నిర్వాహకుడు యదళ్లపల్లి బాలకృష్ణ శుక్రవారం తన దుకాణంలో పనిచేసే పూనెం తేజకు తన ఏటీఎం కార్డు ఇచ్చి డబ్బులు డ్రా చేసుకుని రావాలని పంపించాడు. సూర్యతేజ ఏటీఎంలో డబ్బులు తీస్తున్న క్రమంలో అదే సమయంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చారు. తేజను తికమకపెట్టి అలా కాదు ఇలా అంటూ చెప్పి.. కార్డు మార్చేసి వేరే కార్డుని తేజకు ఇచ్చారు. తిరిగి సూర్యతేజ ఏటీఎం కార్డును యజమానికి ఇవ్వగా ఆ కార్డు తనది కాదని గుర్తించి వెంటనే ఏటీఎం వద్దకు వెళ్లి చూడగా అక్కడ ఎవరూ కనిపించలేదు. కొద్ది సేపటికే ఇల్లెందు సుదిమళ్ల ఏటీఎం వద్ద రూ.31 వేలు డ్రా చేసినట్లు గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైతుల కోసం పొలం బాట

- జిల్లా విద్యుత్ సర్కిల్ సేఫ్టీ ఆఫీసర్ ఎస్.కృష్ణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి పొలం బాట కార్యక్రమాన్ని చేపడుతున్నామని జిల్లా విద్యుత్ సర్కిల్ సేఫ్టీ ఆఫీసర్, డివిజనల్ ఇంజనీర్(టెక్నికల్) ఎస్.కృష్ణ శుక్రవారం తెలిపారు. వంగిన పోల్‌లు, లూజ్ లైన్లను సరిచేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు పొలం బాటలో వంగిన పోల్‌లు 1,215, లూజ్‌లైన్లు 1,255, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు 149 మార్చినట్లు వెల్లడించారు. విద్యుత్ మోటార్లు వినియోగించేపుడు రైతులు జాగ్రత్తగా ఉండాలని, వ్యవసాయ పంపుసెట్లకు విధిగా ఎర్తింగ్ చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయితే వెంటనే రైతులు 1912 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, 48 గంటలు దాటి ఆలస్యమైందని గుర్తిస్తే అధికారులు ప్రత్యామ్నాయ చర్యలను యుద్ధప్రాతిపదికన తీసుకుంటారని స్పష్టం చేశారు.

దామరచర్లలో డెంగీ కేసు నమోదు



డెంగీ సోకిన వ్యక్తి ఇంట్లోని కూలర్‌లో నీటిని తొలగిస్తున్న వైద్యసిబ్బంది

చండ్రుగొండ: మండలంలోని దామరచర్ల గ్రామంలో డెంగీ కేసు నమోదైంది. కంచు బీరయ్య కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా శుక్రవారం పీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహించగా డెంగీ పాజిటివ్‌గా తేలిందని డాక్టర్ కె.తనూజ వెల్లడించారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శితోపాటు సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు సత్వర చర్యలకు ఉపక్రమించారు. గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతో పాటు కాల్వలు శుభ్రం చేయించారు.

బైక్ పల్టీ.. ఎఫ్‌బీఓకు గాయాలు



ఎఫ్‌బీఓ శంకర్‌ను ఆటోలో తరలిస్తున్న స్థానికులు

ములకలపల్లి: ద్విచక్ర వాహనం పల్టీ కొట్టిన ఘటనలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని ముత్యాలంపాడు బీట్ ఎఫ్‌బీఓగా విధులు నిర్వర్తిస్తున్న శంకర్.. పని ముగించుకుని ములకలపల్లి వైపు వస్తున్నాడు. ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో అకస్మాత్తుగా కోతులు అడ్డురాడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. శంకర్ తల, కాళ్లు, చేతులకు బలమైన గాయాలవగా.. స్థానికులు ఆటోలో మంగపేట పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పెనగడపలోని రైతు ఇంట్లో చోరీ..

రూ.1.25 లక్షల నగదు, 25 గ్రాములు బంగారం అపహరణ

కొత్తగూడెంటౌన్: తెల్లవారుజామున ఓ రైతు ఇంట్లోకి చొరబడిన దుండగులు 25 గ్రాముల బంగారం, రూ. 1.25 లక్షల నగదును అపహరించిన ఘటన శుక్రవారం రామవరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. టూ టౌన్ సీఐ ప్రతాప్ కథనం ప్రకారం.. పెనగడప గ్రామంలో నివాసం ఉంటున్న రైతు ఎస్‌కే అబ్బాస్.. తన ఇంటి సమీపంలోనే కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. తెల్లవారుజామున దుకాణం తెరిచేందుకు వెళ్లగా కిటికీ తెరిచి ఉండటం గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా.. బీరువా తాళం పగులగొట్టి 20 గ్రాముల బంగారం, 5 గ్రాముల బంగారు ఉంగరంతో పాటు రూ.1.25 లక్షల నగదు చోరీ చేసినట్లు గుర్తించాడు. టూటౌన్ పోలీసులకు సమాచారం అందించగా.. వారు క్లూస్ టీంతో వచ్చి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రతాప్ తెలిపారు.

సింగరేణిలో ఆరుగురు సర్వే ఆఫీసర్ల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న ఆరుగురు సర్వే ఆఫీసర్లను బదిలీ చేస్తూ కార్పొరేట్ ఈఈ సెల్ హెచ్‌ఓడీ మురళీధర్‌రావు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. వారిలో ఒక సర్వే ఆఫీసర్, ఐదుగురు జూనియర్ సర్వే ఆఫీసర్లు ఉన్నారు. వీరంతా జూలై 5వ తేదీలోపు కేటాయించిన ఏరియా ల్లో విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఓ ప్రైవేట్ బ్యాంక్ అధికారులను మోసం చేసి రుణం తీసుకున్న ఇద్దరితోపాటు ఇదే ఘటనలో దాడికి పాల్పడిన మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్‌ఐ రామ్మూర్తి కథనం ప్రకారం .. అశ్వారావుపేటకు చెందిన తలుపుల అనూష, భర్త శివ కుటుంబ కలహాలతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది మార్చిలో అనూష.. స్థానిక ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో రూ.7.49 లక్షలు కారు లోన్ కావాలని దరఖాస్తు చేసి, పట్టణంలోని దొంతికుంటకు చెందిన తెల్లమాల మంగరాజును తన భర్తగా బ్యాంక్ ఉద్యోగులకు పరిచయం చేసింది. కానీ, తన భర్త శివ పేరుతో ఉన్న ఆధారాలతోపాటు రుణానికి కావాల్సిన ఇతర పత్రాలను సమర్పించి రుణం తీసుకుంది. అయితే, ఈ లోన్‌కు సంబంధించి ఒక నెల ఈఎంఐ చెల్లించి తర్వాత చెల్లించడం లేదు. దీంతో సదురు బ్యాంక్ ఉద్యోగులు లోన్ రికవరీ కోసం అనూష ఇంటి వద్దకు వెళ్లగా, ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో ఆమె భర్త శివ నంబర్‌కు ఫోన్ చేసి ఈఎంఐ చెల్లించాలని అడగ్గా, తాను ఏ బ్యాంక్‌లో కూడా లోన్ తీసుకోలేదని సమాధానం చెప్పాడు. అనంతరం బ్యాంకులో ఆరాతీయగా తనకు తెలియకుండా తన పేరుతో రుణం తీసుకున్నట్లు గుర్తించాడు. మోసం చేసినట్లు వెలుగులోకి రాగా, శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద రుణం తీసుకున్న కారు పార్కింగ్ చేసి ఉన్నట్లు తెలుసుకొని బ్యాంక్ ఉద్యోగులు సీజ్ చేసేందుకు వెళ్లారు. అక్కడే ఉన్న అనూష బంధువులు ప్రేమ్‌కుమార్, చిలకమ్మ కలిసి వారిపై దాడికి పాల్పడ్డారు. బ్యాంక్ ఉద్యోగి యుద్ధనపూడి గోపినాథ్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఇద్దరితోపాటు అనూష, మంగరాజుపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ తెలిపారు.

కుమారుడి భవిష్యత్‌పై బెంగతో..

ఉరివేసుకుని తండ్రి ఆత్మహత్య

జూలూరుపాడు: మూడేళ్ల కుమారుడి భవిష్యత్‌పై బెంగ పెట్టుకున్న ఓ తండ్రి.. చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని భేతాళపాడులో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం.. అన్నారుపాడు గ్రామానికి చెందిన బానోత్ భద్రం (28)తో పదేళ్ల కిందట వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ప్రియాంకకు వివాహమైంది. వారికి మూడేళ్ల కుమారుడు విక్షిత్ ఉన్నాడు. ఆరు నెలల కిందట ప్రియాంక అనారోగ్యంతో మృతి చెందింది. అనంతరం భేతాళపాడు జీపీ పంతులు తండాకు చెందిన పద్మను రెండో వివాహం చేసుకున్నాడు. కాగా, తన కుమారుడు విక్షిత్‌ను మొదటి భార్య కుటుంబ సభ్యులు, రెండో భార్య పద్మ మంచిగా చూసుకోవడం లేదని, తన కుమారుడి భవిష్యత్ ఎలా? అని తీవ్రమనోవేదనకు గురై రాచబండ్లకోయగూడెం సమీపంలోని పొలంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి బానోత్ బద్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు.